అధికారుల అలసత్వం- పనుల్లో నిర్లక్ష్యం

నత్త నడకన సాగుతున్న డివైడర్ పనులు

పొంచిఉన్న ప్రమాదంతో..

వాహనదారులు,పాదచారుల ఆవేదన

బండ్లగూడ, మార్చి 9: అభివృద్ధి పనుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫామ్ చౌరస్తా నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు సుమారు రూ.7 కోట్ల నిధులతో డివైడర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులను ఎస్ఆర్సీ సంస్థ, కుమారస్వామి సంస్థలు దక్కించుకొని చేపడుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టు సంస్థలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫార్మ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రేడియల్ రహదారిపై గతంలో ఉన్న డివైడర్‌ను తొలగించి కాంట్రాక్టు సంస్థలు నూతనంగా రెండువైపులా కాంక్రీట్‌తో దిమ్మెలను నిర్మిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ కాంట్రాక్టు సంస్థలు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పనులు ప్రమాదకరంగా నిర్వహిస్తున్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయం కమాన్ దాటిన తర్వాత డీసీపీ కార్యాలయం గేటు సమీపంలో డివైడర్ పై ఉన్న స్తంభాన్ని తొలగించే క్రమంలో అలాగే వదిలేశారు. దీంతో స్తంభం ప్రమాదకరంగా ప్రధాన రహదారిపై ఓవైపునకు ఒరిగింది. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న డివైడర్ నిర్మాణ పనుల్లో నాణ్యతలేమి ప్రమాదకరంగా జరుగుతున్నాయనే విషయాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్ గౌడ్‌ను వివరణ కోరగా.. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతలేకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నరేందర్ గౌడ్ , ఈఈ

వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద డివైడర్ పై ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పిల్లల పెంపకం నుంచే ఆలోచన విధానం మారాలి

జేడీ లక్ష్మీనారాయణ

వ్యాపారవేత్త, సినీ నిర్మాత ఉషా ముల్పూరికి అవార్డు అందజేస్తున్న సీబీఐ మాజీ జే డీ లక్ష్మీనారాయణ

వెంగళరావునగర్, మార్చి 9:మగ పిల్లలు, ఆడ పిల్లలు అనే తేడా లేకుండా వారిని తల్లిదండ్రులు పెంచే విధంగా, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సారథి స్టూడియోలో తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డ్స్–2025 వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా, సామాజిక , సినీ రంగంతో పాటు పలు రంగాల్లో విశేష సేవలందించిన పలువురు మహిళలకు ఆయన అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సమాజం, ఒక దేశం ముందుకు వెళ్లాలన్నా, అభివృద్ధి చెందాలన్నా అందులో మహిళల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ చరిత్రను చూసినా కూడా ఓ రాణి రుద్రమదేవి, ఓ చాకలి అయిలమ్మ గుర్తుకు వస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకుడు జి. కిరణ్ కుమార్, సినీ నటుడు, మాజీ శాసన సభ్యుడు బాబూ మోహన్, సినీ నటి ఎస్తేర్, యూట్యూబర్ గంగవ్వ, సినీ నటి ఎస్తేర్, పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జీవాంజి, ప్రముఖ గైనకాలజిస్ట్ జయంతిరెడ్డి, తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, హంసవాణి తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటా

బన్సీలాల్‌పేట్, మార్చి 9: వీధి వ్యాపారులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం పద్మావతినగర్, బోయిగూడ ప్రాంతాలలో చిరు మహిళా వ్యాపారులు ఎమ్మెల్యే తలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్.వెంకటేశన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకం- కలెక్షన్స్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంత్ డైమండ్స్ అధినేత జూస్తి వెంకట్, భాను ప్రకాశ్, విష్ణు ప్రియతో కలిసి స్త్రీ వ్యక్తిత్వానికి గుర్తుగా 'ఏకం- కలెక్షన్స్'ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మహిళలను సత్కరించారు. –సిటీబ్యూరో, మార్చి 9,(నమస్తే తెలంగాణ) :

రాజీవ్‌నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన మద్దుల సురేశ్ చంద్ర తన తల్లిదండ్రులైన ఎంవీ సుబ్బారావు, ఎంవీఎస్ రాజ్యంల జ్ఞాపకార్థం పేరిట చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాజీవ్‌నగర్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని కాలనీ అధ్యక్షుడు వినయ సాగర్, గౌరవాధ్యక్షుడు కృష్ణ శర్మ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు అధిక సంఖ్యలో హాజరై సురేష్‌చంద్రను అభినందించారు. – ఎర్రగడ్డ, మార్చి 9 :

ప్రమోషన్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ఎస్ఎన్ రెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్ నగర్,మార్చి 9: హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, సీవరేజ్ బోర్డు (జలమండలి)లో పనిచేస్తున్న అర్హులైన కిందిస్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్ రెడ్డి భవన్‌లో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, సీవరేజ్ బోర్డు స్టాఫ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసింహ హాజరై మాట్లాడుతూ ఏండ్ల తరబడి జలమండలిలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తరుచూ ఉద్యోగులను బదిలీలు చేయడం వల్ల సీవరేజ్ పనుల నిర్వహణలో ఆలస్యం కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. జలమండలిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. నరసింహ, ఉప ప్రధాన కార్యదర్శి జి.బి.సర్వేష్, నేతలు దేవదాస్, ఆనంద్ కుమార్, అశోక్, డి.నరసింహ, యాదయ్య, జంగయ్య, యాద గిరి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజకీయ చైతన్యం అవసరం

నారాయణగూడ పద్మశాలి భవన్ నుంచి బైక్ ర్యాలీగా వెళ్తున్న మహిళా నేతలు

హిమాయత్ నగర్ , మార్చి 9: పద్మశాలీలకు రాజకీయ చైతన్యం ఎంతో అవసరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన పద్మశాలి సభకు మహిళలు నారాయణగూడ పద్మశాలి భవన్ నుంచి బైక్ ర్యాలీతో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పద్మశాలీలు ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవడంతో పాటు రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక, మహిళా నేతలు వనం దుశ్యంతల, గుర్రం వర్ణలీల, చిలువేరు సునీత, మాధవి, పూర్ణిమ, కందగట్ల చేతన, అరుణ, స్రవంతి, వాణి, హేమలత, కందగట్ల దుర్గ, సంతోషి,అశ్విని తదితరులు పాల్గొన్నారు.

'బహురూపులవాడు'

పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, మార్చి 9: రచయిత కల్లూరి భాస్కరం రచించిన బహురూపులవాడు పుస్తకాన్ని ప్రముఖ కవులు, రచయితలు డాక్టర్ గోవిందరాజు చక్రధర్, డాక్టర్ విరించి విరి వింటి, వాడ్రేవు చినవీరభద్రుడు, టి. ప్రకాశ్ తో కలిసి సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకంలోని కథలు, వాటి విశేషాలను రచయిత కల్లూరి భాస్కరం వివరించారు.



తెలుగు సాహిత్య అనువాదం అభినందనీయం

ఇన్‌కం ట్యాక్స్ విశ్రాంత ఛీఫ్ కమిషనర్ నరసింహప్ప

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఖైరతాబాద్, మార్చి 9 : తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదింపజేస్తున్న భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఇన్‌కం ట్యాక్స్ విశ్రాంత ఛీఫ్ కమిషనర్ యం.నరసింహప్ప పేర్కొన్నారు. ప్రముఖ కవి డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన ఐయల్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచార సభలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ మామిడాల శైలజ,యువకవి ధృవనల్లా రాసిన అనువాద గ్రంథాల ఆవిష్కరణ సభ,మహిళా వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నరసింహప్ప, తెలుగువన్ ఎండీ కంఠంనేని రవిశంకర్ లు పుస్తకాలను ఆవిష్కరించారు. మామిడాల శైలజ రాసిన గతి తప్పిన రుతువు నవల ఆంగ్లంలో "ది ఎక్స్ ఆఫ్ సైలెన్స్, హిందీలో "అవికసిత్"పేరుతో అనువాదించడం మంచి పరిణామమన్నారు. యువకవి ధృవ తెలుగులో రాసి 'రెండు రంగుల ఇంద్ర ధనుస్సు'ను హిందీలో "దో రంగోంకా ఇంద్ర ధనుష్ పుస్తకం అద్భుతంగా ఉన్నాయన్నారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త ఆలూరు సుభాష్ బాబుకు "విద్య, ఉద్యోగ ప్రదాత"పేరుతో జాతీయ జీవన సాఫల్య లెజండరీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవికా చౌదరి, డాక్టర్ పి.సునంద బాయి, ప్రొ.బి.ఆండాళ్ళు, ఆశలత, విజయ తదితరులకు జాతీయ జీవన సాఫల్యపురస్కారాలు అందజేశారు.

జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలి

ఖైరతాబాద్, మార్చి 9 : కురుమలకు జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాల్సిందేనని కురుమ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు ముత్త సంపత్ కురుమ, హైకోర్టు న్యాయవాది తెలంగాణ సామాజిక చైతన్య వేదిక సర్రి స్వామితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కురుమలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురయ్యారన్నారు. చట్టసభల్లో తగిన ప్రాధాన్యత దక్కడం లేదని, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా కురుమలు ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో కురుమ హక్కుల వేదిక అధ్యక్షులు కోశిక శ్రీనివాస రావు, నాయకులు రమేశ్, శ్యామ్ కురుమ, రమేశ్, పర్వతాలు, వంశీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్,మార్చి 9: సంఘ సేవకురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను నేడు (సోమవారం) ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. చదువుల తల్లి సావిత్రీ బాయి పూలే సమాజంలో ఉన్న బాలికలకు, మహిళలకు విద్య ఆవశ్యకతను తెలియ జేశారని చెప్పారు. సమాజాన్ని చైతన్యం చేసేందుకు చేసిన పోరాటంలో అనేక అవమానాలు ఆటుపోట్లను ఎదుర్కొని ముందడుగు వేసిందని గుర్తు చేశారు.మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీకగా సావిత్రీబాయి పూలే నిలుస్తారని తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి

బేగంపేట్, మార్చి 9: కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేటలోని బుద్ధా నగర్ కాలనీకి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బాజీబాబా, కాలనీవాసులతో ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాజీబాబాకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా త్వరలోనే బుద్ధానగర్‌లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కాలనీవాసులు వినోద్, శ్రీను, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించకుంటే..

ఉపేక్షించేది లేదు

యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో దుకాణాలను సీజ్ చేస్తున్న ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్ తదితరులు

జూబ్లీహిల్స్, మార్చి9: ఆస్తి పన్ను చెల్లింపులకు ఈ నెల 31తో గడువు ముగియనుండడంతో జీహెచ్ఎంసీ అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలులో వేగం పెంచారు. ఈ ఏడాది 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియ డానికి మరో 22 రోజులే గడువు వుండడంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు దూకుడు పెంచారు. ఆదివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి వున్న దుకాణాలను ఇన్‌చార్జి ఏఎంసీ బాలరాజ్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు.జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావు నగర్, బోరబండ, ఎర్రగడ్డ వార్డులలో 9 డాకెట్స్ గా విభజించి ఆస్తి పన్ను వసూలును ముమ్మరం చేస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించకుంటే ఉపేక్షించేది లేదన్నారు. గడువులోపు బకాయిలు చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామని డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా హెచ్చరించారు. పాత బకాయిలతో పాటు మొత్తం ఆస్తిపన్ను చెల్లించిన వారికి వన్ టైమ్ సెటిల్ మెంట్ లో భాగంగా వడ్డీపై 90 శాతం మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఆధ్యాత్మికత, యోగాసనాలు అవసరం

శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్

బండ్లగూడ, మార్చి 9: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ లో ఆదివారం భగత్‌సింగ్ శాఖ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 15 ఏండ్లుగా కిస్మత్ పూర్ గ్రామంలో భగత్ సింగ్ శాఖ ఆధ్వర్యంలో యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతిరోజూ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కిస్మత్పూర్ గ్రామంలో భగత్‌సింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ ఈ సభ కార్యక్రమం నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మంచి ఆలోచనలు సమాజ శ్రేయస్సుకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కన్వీనర్ అన్నపురెడ్డి భీమ అర్జున్ రెడ్డి,కిస్మత్పూర్ మాజీ సర్పంచ్ జయశ్రీ సదానంద, యోగా శిక్షకులు బుజ్జి వెంకటేష్, స్వామి,అమీర్, గూడెం నర్సింగ్‌రావు, విఠల్, త్యాగం సత్తయ్య యాదవ్, నరేందర్, శంకరయ్య బండారి మల్లేష్ యాదవ్ ,సుదర్శన్ నరసింహారెడ్డి, ఉమేష్, సురేందర్, గుడి దేవుని వెంకటేష్ , బీజేపీ నాయకులు నీరు పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో భగత్ సింగ్ శాఖ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న స్వామి గౌడ్

ప్రిన్సిపాల్‌కు వేధింపులు

యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 9: పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ నంబర్ తీసుకుని నిరంతరం వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలిచౌక్ సమీపంలోని సమతా కాలనీలో నివాసం ఉంటున్న మహిళ (32) స్థానికంగా పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. భర్త రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిపోగా నలుగురు పిల్లలతో కలిసి ఆమె నివాసం ఉంటున్నారు. ఇటీవల తమ పాఠశాలలో అడ్మిషన్లు కోసం కరపత్రాలు ప్రచురించారు. ఈ కరపత్రంలో ప్రిన్సిపాల్ నెంబర్ చూసిన ఓ యువకుడు ఆమె ఫోన్ నెంబర్ తీసుకొని తరచూ కాల్ చేస్తున్నాడు. ఆమెతో పరిచయం పెంచుకుని రాత్రీ పగలు అనే తేడా లేకుండా ఫోన్లు చేస్తున్నాడు. ఫోన్ ఎత్తకపోతే స్కూల్ వద్దకు వచ్చి న్యూసెన్సు చేస్తున్నాడు. అతడి వేధింపులు ఎక్కువ కావడంతో మహిళ ఫిలింనగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

అమీర్పేట్: బల్కంపేటలోని ఎస్ వి మాణిక్ ఆర్కేడ్ నివాసితుల సంఘం ప్రతినిధులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను మాజీ కార్పొరేటర్ ఎన్ శేషు కుమారి దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతను గుర్తించిన మాజీ కార్పొరేటర్ విషయాన్ని ఆదివారం ఉదయం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి సమస్యను వివరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిక్కడపల్లి, మార్చి 9: బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ బూత్ స్థాయి కమిటీ సమావేశం ఆదివారం రాంనగర్లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు టీ. శంకర్ ముదిరాజ్‌అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళా నాయకులను కార్యకర్తలను ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిశీలకు కొండపల్లి మాధవ్. డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి, నాయకులు వి.ఇంద్రసేన రెడ్డి. ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్, కళ్యాణ్‌నాయక్, గోక నవీన్, ఆర్.జైదేవ్, టీవీ రాజు, సాబీర్, సత్యనారాయణ, పి.విజయకృష్ణ, సందీప్, గండు వెంకటేష్, సునీల్, రాజేష్, అమర్, శ్రీకాంత్, వై.వెంకటేష్ గుప్త.కల్పన సాలమ్మ.తులసి.మంజుల. మేరీ, లక్ష్మి,అనురాధ, శ్రీలత లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

IN THE COURT OF THE HON'BLE VI ADDL. DISTRICT & SESSIONS JUDGE : AT KUKATPALLY.
O.S.No. 337 of 2022

Between:
1. Siraswal Meva, W/o. Siraswal Dara Singh & Others ...Petitioners
And
1. M/s. Vasantha Estates & another ...Defendants

To
1. M/s. Vasantha Estates Rep. by its Managing Partner, Sri. Vasantha Venkata Krishna Prasad, S/o. Vasantha Nageshwara Rao, Aged about 52 years, Occ: Business, R/o. H.No. 142, Rao & Raj Colony, Banjara Hills, Road No.2, Hyderabad.
2. D.V. Satyanarayana Raju S/o. D.V. Krishnam Raju, aged about 76 years, Occ: Business, R/o: H.No. 2-2-23/22/24, Bagh Amberpet, Hyderabad.

Please take notice that the petitioners/ appellants herein had filed the above O.S. No. 337/2022 and the Hon'ble court posted the above matter on **24-03-2025** for your appearance. Hence, you are hereby directed to appear before the above said court and to file counter if any, failing which the matter will be decided in your absence

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- **KALANIDHI SANJEEVA KUMAR**
High Court Advocate
H.No: 1-1-95, Flat No.207, Steekrupa Apartment, Shrungeri Colony. Street No.1, Mohan Nagar, Kothapet, Hyderabad-35.
Ph: 9440217782.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ఆదివారం మానవ సేవే మాధవ సేవా సంస్థ, శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ సహకారంతో భావన ఋషి నగర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సేవాభారతి మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య మహిళా సిబ్బంది, ఆశవర్కర్లను సత్కరించారు.

ఆరాంఘర్ చౌరస్తాలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి